క్లుప్తంగా

మక్కాయాత్రకు బయలుదేరిన ముస్లింలు



మచిలీపట్నంటౌన్: సౌదీలోని పవిత్ర మక్కా యాత్రకు కృష్ణా జిల్లా మచిలీపట్నం నుంచి దాదాపు 70 మంది ముస్లిం యాత్రికులు శుక్రవారం బయలుదేరారు. స్థానిక జవారుపేట దర్గా ఆవరణ వద్ద నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున ప్రత్యేక విమానంలో వీరంతా వెళ్లనున్నారు. మక్కాలో దాదాపు 12 రోజుల పాటు వీరంతా ఉమ్రా చేయనున్నారు. మక్కా యాత్రకు వెళ్లే ముస్లింలు జుమా నమాజ్ చేసిన అనంతరం టిక్కా లోని షాషా కలందర్ బాబా ఆశీస్సులు కోసం దర్శించుకున్నారు. మక్కా యాత్రకు బయలుదేరిన ముస్లిం యాత్రికులను మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర మక్కాయాత్ర విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి రావాలని ఆకాంక్షించారు.

ఉపాధి పనులు చేపట్టండి

పెడన: వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల్లో ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీడీవో వి.రెడ్డయ్య అన్నారు. శుక్రవారం ఆయన తన చాంబరులో మండలంలోని ఫీల్డ్ అసిస్టెంటెంట్లతో పాటు ఏపీవో, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లతో ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గత ఏడాది కానీ, అంతకు ముందు వర్షాకాలంలో ముంపు బారిన పడిన ప్రాంతాలను గుర్తించాలన్నారు. అలా గుర్తించిన ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. పంట పొలాల్లోనూ వర్షం నీరు నిలిచిపోకుండా పారుదలయ్యేలా చూడాలన్నారు. ఏపీవో వజీర్, టీఏ కిషోర్, రమేష్, ఫీల్డ్ అసిస్టెంటెంట్లు పాల్గొన్నారు.

కంప్యూటర్ల బహూకరణ

భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాతలు మూడు కంప్యూటర్లను శుక్రవారం బహూకరించారు. గ్రామానికి చెందిన దాతలు చందు సత్యనారాయణ, సుబ్బారావు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. స్వగ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు లక్షరూపాయల విలువైన మూడు కంప్యూటర్లను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా హెచ్ఎం ఆకుల జ్యోతిరమ్మయికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ, వ్యాపారాల రీత్యా దూర ప్రాంతాల్లో స్థిరపడినవారు జన్మిచ్చిన గ్రామానికి సాయం చేయడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో ఇలాంటి సాయం అందిస్తే విద్యార్థులకు, ప్రజలకు విస్తృత మేలు కలుగుతుందన్నారు. దాతలు మాట్లాడుతూ మరో రెండునెలల్లో పాఠశాలలో సైకిల్ షెడ్ నిర్మిస్తామని ప్రకటించారు. దాతలను పాఠశాల తరఫున ఎమ్మెల్యే సత్కరించారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఎంఈఓ-1 టీవీఎం రామదాసు, ఎంఈఓ-2 ఎ.రామారావు, టీడీపీ నేత మెండు లక్ష్మణరావు, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా శ్రీవిజయ అమలేశ్వరీదేవి

పెడన: మండల పరిధిలోని దావోజీపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ విజయ అమలేశ్వరీదేవిని శుక్రవారం శాకంబరీదేవిగా అలంకరించారు. ఈ దేవాలయంలో మొదటి సారిగా శాకంబరీ ఉత్సవాలు నిర్వహించడంతో పరిసర ప్రాంత ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. అంకెంవారి ఆడపడుచులు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లతోఅలంకరించారు. చైర్మన్ అంకెం శ్రీనివాస్, సెక్రటరీ అంకెం శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

బంటుమిల్లి: ప్రేమ వ్యవహారం వికటించడంతో ఆత్మహత్యాయత్నం చేసిన యువతి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందింది. ఎస్ఐ వాసు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గరికముక్కు విజయకుమార్ కుమార్తె సుస్మిత (19) స్థానికంగా ఒక వస్త్ర దుకాణంలో పనిచేస్తుంది. మండలంలోని రామన్నమోడి గ్రామానికి చెందిన హనుమంతుతో పరిచయం ప్రేమగా మారింది. ప్రేమ కాస్త పెళ్లి వరకు వచ్చేసరికి హనుమంతు వివాహానికి నిరాకరించాడు. దీంతో ఈ నెల 14వ తేదీన ఎలుకల మందు తిని సుస్మిత ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. తండ్రి విజయకుమార్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. బందరు డీఎస్పీ అబ్దుల్ సుబాన్ దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి పన్నుల కోసం కొలతల సేకరణ

కోడూరు: మండలంలోని 13 పంచాయతీల పరిధిలో హౌస్ ట్యాక్స్ (ఇంటి పన్ను) ప్యూరిఫికేషన్ ప్రక్రియ వేగంగా సాగుతోంది. సచివాలయ, పంచాయతీ అధికారులు ఇళ్లకు సంబంధించిన కొలతలు, యజమాని వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్యూరిఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటి ఆధారంగా ఇంటి పన్నును నమోదు, గత ఇంటి పన్నుల్లో మార్పులు, చేర్పులు చేయనున్నట్లు అధికారులు చెప్పారు.

చెరువులను తలపిస్తున్న పొలాలు

- దెబ్బతిన్న నారుమళ్లు
- పొలాల్లో నీరు పోక ఇబ్బందులు
- ఖరీఫ్ సీజన్ లేటయ్యే అవకాశం
- రెండో పంటపై ప్రభావం



నక్కవానిదారి సమీపంలో చెరువులను తలపిస్తున్న పొలాలు



ఆకులమన్నాడులో పంటపొలాల్లో నిలిచిన వర్షం నీరు

కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని 13 పంచాయతీల పరిధిలోని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 22 వేల ఎకరాల్లో వరిపంటను సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. సీజన్ ఆరంభంలోనే వర్షాలు ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతోందని రైతులు వాపోతున్నారు. పొలాల్లో నారుమళ్లు పోసేందుకు కూడా వీలు లేకుండా ఉందని, పొలాలు మొత్తం చెరువులను తలపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసుకున్నారు. డ్రెయినేజీల్లో నీరు పైకి ఎగతట్టడంతో పొలాల్లో నీరు పోయే పరిస్థితి కనిపించడం లేదంటున్నారు. వర్షాలకు ముందు కొంతమంది రైతులు వెదసాగులో పంటను సాగు చేసేందుకు విత్తనాలు చల్లగా అవి వారం రోజుల నుంచి నీటిలో నానుతున్నాయి. ఇవి మొలకలు రావడం కష్టమేనని అన్నదాతలు వాపోతున్నారు.

సీజన్ లేటయ్యే అవకాశం..

పొలాల్లో ముంపు నీరు పోయి, నారు అందుబాటులోకి రావాల్సి ఉంది. ఈ ప్రక్రియ జరిగేందుకు మరి కొంతకాలం పడుతుంది. దీనివల్ల ఖరీఫ్ పనులు ఆలస్యమవుతాయి. దీని ప్రభావం రెండో పంటపై పడుతుందని రైతులు అంటున్నారు. డ్రెయినేజీలు సక్రమంగా ఉంటే ఈ సమస్యను అధిగమించవచ్చని రైతులు పేర్కొంటున్నారు. డ్రెయినేజీల ప్రక్షాళనపై అధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

నీట మునిగిన వెదసాగు వరి పొలాలు..

కృత్తివెన్ను: గడిచిన మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల ధాటికి డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో సముద్రపు పోటు ఎగదన్నటంతో వర్షం నీరు బయటకు పోయే పరిస్థితి లేదు. దీంతో వెద సాగుపద్ధతిలో సాగవుతున్న వరిచేలు, నారుమడులు నీట మునిగిపోయాయి. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగితే వరి కుళ్లిపోతుందని రైతులు వాపోతున్నారు. ప్రతిరోజూ కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. రక్షిత మంచినీటి పథకాల ద్వారా విడుదయ్యే నీటిని పూర్తిస్థాయిలో క్లోరినేషన్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రైతు సాయం అందజేయాలి

బంటుమిల్లి: ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రూ.20 వేల రైతు సాయాన్ని వెంటనే రైతు ఖాతాలకు జమ చేయాలని, అలాగే కౌలు రైతులకు కూడా సాయం అందజేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. ఇప్పటికే దాదాపు సంవత్సర కాలంగా మిచాంగ్ తుపాను పరిహారం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సార్వా పనులు ముమ్మరంగా జరుగుతున్న క్రమంలో ప్రభుత్వం వెంటనే స్పందించి మిచాంగ్ తుపాను పరిహారం, రైతు సాయం నిధులు రైతుల ఖాతాలకు జమ చేయాలని వినతి పత్రంలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన 22వ జీఓను, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని రైతు సంఘం డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, మండల నాయకులు ఎం.శివరాంప్రసాదు, ఎల్.అజయ్‌ఘోష్, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.జనార్ధన్‌రావు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దమ్ముకు సిద్ధమైన జీలుగ పంట

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో పచ్చిరొట్ట పైరుగా వేసిన జీలుగ పంట దమ్ముకు సిద్ధమైంది. తీర ప్రాంతాల్లోని చౌడు భూములను సారవంతం చేయడంలో పచ్చిరొట్ట విత్తనంగా జీలుగ మంచి ఫలితాలు ఇస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాల వినియోగాన్ని



బంటుమిల్లి-2 సచివాలయంలో కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘ నేతలు

ప్రోత్సహించేందుకు 50 శాతం రాయితీపై జీలుగ విత్తనాలు సరఫరా చేశారు. ఈ విత్తనాలను మల్లేశ్వరం, ముంజులూరు, కంచడం తదితర గ్రామాల రైతులు అత్యధికంగా వినియోగిస్తున్నారు. మండలంలో అత్యధికంగా వెద పద్ధతిన సార్వా సాగు చేస్తున్నందున పచ్చిరొట్ట వితనం వినియోగం తగ్గించారు. దీనిపై ఏఓ శివరామకృష్ణ మాట్లాడుతూ మండలంలో పచ్చిరొట్ట విత్తనాలుగా జీలుగ 70 క్వింటాళ్లు, 10 క్వింటాళ్లు పిల్లిపెసర విత్తనాలు దాదాపు 400 ఎకరాలకు సంబంధించి పలు గ్రామాలకు చెందిన రైతులకు అందజేశామన్నారు.

స్తంభించిన జనజీవనం..

గూడూరు: గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలతో గూడూరు మండలంలో జనం ఇళ్ల నుంచి బయటకు రావడంలేదు. పంట పొలాల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. కాల్వల్లో గుర్రపుడెక్క దట్టంగా అలుముకోవడంతో పొలాల్లో నీరు బయటకు పోవడానికి అవకాశం లేకుండా పోయింది. జనావాసాల్లో కూడా నీరు నిలిచిపోవడంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మల్లవోలుకు చెందిన పామర్తి సరస్వతికి చెందిన ఒంటినిట్టాడి తాటాకు ఇంటి గోడలు కూలిపోయాయి. దీంతో రెవెన్యూ అధికారులు తక్షణ సహాయం కింద 10 కిలోల బియ్యం, లీటరు మంచి నూనె, కిలో కంది పప్పు అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు ఎస్.సారాశాంతి తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు సద్వినియోగం చేసుకోండి

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డీజీఎం జె. ఉమామహేశ్వరరావు కోరారు. నగరంలోని బుట్టాయిపేటలోని ఆ సంస్థ కార్యాలయంలో శుక్రవారం బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మచిలీపట్నంలో బుట్టాయిపేట, జిల్లా పరిషత్, రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను ప్రారంభించిందన్నారు. గాంధీ విద్యాలయం, గొడుగుపేట ప్రాంతాల్లో కూడా ఈ సేవలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రైవేటు టెలికాం సంస్థలు అత్యధిక రేట్ల టారిఫ్‌లతో సేవలు అందిస్తున్నాయని బీఎస్ఎన్ఎల్ మాత్రమే సరసమైన ధరలతో సేవలు అందించటం జరుగుతోందన్నారు. ఏజీఎం ఈ శ్రీనివాసరావు, జేటీవో సుమంత్‌కుమార్, ఎఈ శివ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులు, దుకాణాల వేలం వాయిదా

- గత కొన్ని సంవత్సరాలుగా ఇదే దుస్థితి
- ధరెక్కువంటున్నారని అధికారులు.. బాగు చేయించడం లేదు : పాటదారులు

పెడన: పురపాలక సంఘ పరిధిలోని నాలుగు చెరువులు రెండు సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చేందుకు, ఖాళీగా ఉన్న 18 మున్సిపల్ దుకాణాలకు శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. అయితే ఈ వేలంలో పాల్గొనేందుకు ఎవరూ ఆసక్తి చూపించలేదు. గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. నిరుడు మూడు దఫాలుగా వేలం వేసినా ఎవరూ ముందుకు రాలేదు. ఈ ఏడాది ఇప్పుడు రెండో సారి వేలం వేశారు. ఎవరూ వేలంలో పాల్గొనలేదు. దీంతో వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య తెలిపారు. వాస్తవంగా పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన కొత్త చెరువు, గుడివాడ రోడ్డులోని తాత్కాలిక డంపింగ్‌యార్డు పక్కన తామర చెరువు, దక్షిణ తెలుగుపాలెంలోని వాటర్ వర్క్స్ పక్కన కొలుకుల వారి చెరువు, పదో వార్డులోని మల్లి చెరువులలో చేపల సాగుకు వీలుగా చెరువులుండాలి. కానీ ఆ విధంగా లేవని, చెట్లు, మొక్కలు బాగా పెరిగి లోపలకు, బయటకు పోవడానికి దారులు లేవని పాటదారులంటు



వేలం నిర్వహించడానికి వేచి ఉన్న మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య ఇతర సిబ్బంది

న్నారు. మరో పక్క దుకాణాలు సైతం వర్షం వస్తే కారుతున్నాయని, పరిశుభ్రంగా లేవని అంటున్నారు. వీటిని బాగు చేయించి వేలం పెడితే ఎవరైనా పాడుకోవడానికి ఆసక్తి చూపుతారని, వాటిని అలాగే ఉంచి వేలం నిర్వహిస్తే ఎవరొస్తారనే వాదన వ్యక్తమవుతోంది. అయితే అధికారులు వేలం పూర్తయిన తర్వాత వాటిని బాగు చేయించి ఏ తేదీకి అప్పగిస్తామో అప్పటి నుంచి పరిగణలోకి తీసుకుంటామని, అద్దె తేదీ ఫిక్స్ చేస్తామంటున్నారు. నిధులు లేక వాటిని బాగు చేయించడం లేదని అంటున్నారు. ఏది ఏమైనా మున్సిపాలిటీ ఆదాయం పెరిగేందుకు అధికారులు చొరవ చూపాలని పాలకులు కోరుతున్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలి

మోపిదేవి: పార్టీలకు అతీతంగా అందరికీ రూల్ ఆఫ్ లా ఒకేలా అమలు కావాల్సిందే నని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల ఉపాధ్యక్షురాలు నడకుదుటి జననీ కుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే ఆయా గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు పనిచేయాలని చెప్పారు. జగనన్న లే అవుట్స్‌లో మౌలిక సదుపాలు ఏర్పాటు చేయాలని, కనీసం విద్యుత్, రోడ్లు, త్రాగునీటి విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకునే దిశగా అధికారులు అడుగులు వేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. అంతకు ముందు తొలిసారిగా మండల పరిషత్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేను అధికారులు శాలువా



మోపిదేవి మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

కప్పి, పూల దండలతో సత్కరించారు. మోపిదేవి గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, నాగాయితిప్ప సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కడవకొల్లు సీతారామాంజనేయులు, ఇన్‌చార్జి ఎంపీడీవో రామలింగేశ్వరావు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, పలుశాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోనేరుసెంటర్: మచిలీపట్నంలోని ఓ లాడ్జిలో జరుగుతున్న పేకాటపై శుక్రవారం ఆర్‌పేట పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాటరాయుళ్ళతో పాటు పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సోమేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని జీకే గ్రాండ్‌లో కొంత మంది పేకాట నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న సీఐ స్టేషన్ సిబ్బందితో కలిసి దాడి చేయగా ఏడుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 37,550 నగదు, ఏడు ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన పేకాటరాయుళ్లను కోర్టుకు హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

సేవాస్ఫూర్తితో పనిచేయాలి

చల్లపల్లి(అవనిగడ్డ): జనసేన నాయకులు, కార్యకర్తలు సేవా స్ఫూర్తితో పనిచేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. చల్లపల్లి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి స్వార్థ చింతన లేకుండా సమాజానికి మేలు చేయాలనే సంకల్పంతో పవన్‌కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారని, ఆయన బాటలో జనసైనికులు తెల్లకాగితంలా పనిచేయాలని పిలుపినిచ్చారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు చోడగం విమల్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి తోట మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు, సీనియర్ నాయకుడు బాదర్ల లోలాక్షుడు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

పెడన: పట్టణంలోని 11వ వార్డుకు చెందిన గూడురు ఏసోబుకు సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రై సైకిల్‌ను అందజేశారు. ఏసుబు రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు తీసేశారని, వృత్తి రీత్యా చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తూ సహాయ ఫౌండేషన్‌ను సంప్రదించి, సైకిల్ కావాలని కోరడంతో అతనికి సైకిల్ అందించినట్లు ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్‌బాషా తెలిపారు. సహాయ ఫౌండేషన్ సభ్యుడు తాతా సాయిరాం సహకారంతో ట్రై సైకిల్ అందజేశామన్నారు. మట్టా రాధాకృష్ణమూర్తి, కోన వెంకటేశ్వరమ్మ, రౌతుల ప్రసాద్, బట్ట దుర్గాశంకర్, విఘ్నేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్రై డే డ్రై డే పాటిద్దాం

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తూ గృహాల్లో ఉన్న నీటి నిల్వలను, లార్వాలను తొలగించే కార్యక్రమం చేపట్టాలని నగరంలోని చిలకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.శ్రావ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను అనుసరించి మలేరియా, డెంగీ వ్యాధుల నివారణ కోసం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి నిల్వలు ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు, టైర్లు, వృథాగా పారేసిన వస్తువుల్లో లార్వాలు ఉంటాయని, వాటిని శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఎల్‌సీడీసీ సర్వే ద్వారా అనుమానిత లక్షణాలు ఉన్న కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి వ్యాధి నిర్ధారణ కోసం పంపి నిర్ధారణ అయిన తరువాత మందులను అందిస్తామన్నారు. ఎవరికైనా నీళ్ల విరేచనాలు, అతిసారం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను అందించి నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.మురళి మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఆరోగ్య విద్య, విస్తరణాధికారి బి.శివసాంబిరెడ్డి, ఏఎన్ఎం నాగమణి, కె.బాలాజీ, సీహెచ్ ప్రవీణ్‌కుమార్, ఆశాలు పాల్గొన్నారు.

వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తు చేయండి

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): భారత వాయుసేనలో అగ్నివీర్ పథకం ద్వారా ఉద్యోగాల నియామకం కోసం యువత మక్కువ చూపాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాబోయే కాలంలో భారతదేశాన్ని అత్యంత శక్తివంతమైన దేశాల్లో ఒకటిగా మార్చాలంటే యువతే కీలకమన్నారు. ఈ ఉద్యోగాలకు 2004 జూలై నుంచి 2008 జనవరి మధ్య జన్మించిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిజిక్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో, ఇంటర్మీడియెట్‌లో ఒకేషనల్ లేక పాలిటెక్నిక్ కోర్సుల్లో కనీసం 50 శాతం మార్కులతో పాసై ఉండాలన్నారు. ఈ నెల 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబరు 10వ తేదీ నుంచి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

గణపేశ్వరం దుర్గమ్మకు ఆషాఢ సారె

గణపేశ్వరం(నాగాయలంక): ఆషాఢ మాసం పురస్కరించుకుని మండలంలోని గణపేశ్వరంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం పలు గ్రామాల భక్తులు ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు), అరుణ దంపతులు పర్యవేక్షణలో రేమాలవారిపాలెం, దిండి, బర్రంకుల గ్రామాల నుంచి తరలివచ్చిన మహిళలు, భక్తులు ఆలయంలోని నిలువెత్తు దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ఆలయ అర్చకుడు పోతుకూచి సత్యనారాయణశాస్త్రి నేతృత్వంలో గ్రామాల నుంచి తెచ్చిన ఆషాఢ సారెను సంప్రదాయబద్ధంగా సమర్పించారు. భక్త సమాజాల సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

వేళ్లమ్మ అమ్మవారికి ఆషాఢ సారె

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో వేంచేసియున్న వేళ్లమ్మ అమ్మవారికి గ్రామస్తులు శుక్రవారం ఆషాఢ సారెను సమర్పించారు. మహిళలు గ్రామంలో గోకర్ణేశ్వరస్వామివారి ఆలయం వద్ద నుంచి ఊరేగింపు ఆషాఢ సారెను



గణపేశ్వరం దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించిన మూడు గ్రామాల మహిళలు

తీసుకువచ్చారు. రామమందిరంలో పూజలనంతరం అమ్మవారికి సారెను సమర్పించారు. 21 రకాల పుష్పాలు, పండ్లు, చీరలు, గాజులు, పసుపు, కుంకుమతో పాటు నైవేద్యాలను సమర్పించి భక్తి భావం చాటారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌కు విచ్చేసే ఉద్యోగులు, ప్రజలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని శుక్రవారం ప్రధాన గేటు వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ పాల్గొన్నారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు, ఉద్యోగులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. వారితో అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద హెల్మెట్లను కొనుగోలు చేయించారు. తప్పనిసరిగా ప్రతిరోజూ హెల్మెట్ ధరించి ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు సిద్దిఖ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కోడూరు: హెల్మెట్ వినియోగంపై పోలీసులు శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక కోట రాఘవయ్య డిగ్రీ కళాశాలలో ఎస్ఐ శిరీష ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపరాదని, ప్రమాద సమయంలో హెల్మెట్ రక్షణ కవచంగా పని చేస్తుందని ఎస్ఐ అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు హెల్మెట్ వినియోగం వల్ల కలిగే ఉపయోగాలను వివరించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. విద్యాసంస్థల అధినేత కోట వెంకట సుబ్బారావు, ప్రిన్సిపాల్ డి.కరుణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



హెల్మెట్ అందజేస్తున్న జేసీ గీతాంజలీశర్మ

కాలువలో తూడు, గుర్రపు డెక్క తొలగింపు

కోడూరు: మండలంలోని ఉల్లిపాలెంకు వెళ్లే 11వ నంబర్ పంటకాలువలో శుక్రవారం ఇరిగేషన్ అధికారులు గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. కోడూరు వంతెన సెంటర్ నుంచి తూర్పు వైపు వరకు ప్రొక్లయిన్ సహాయంతో పనులు ప్రారంభించారు. కాలువ దిగువ భాగంలో ఉన్న మట్టి దిబ్బలను కూడా తొలగిస్తున్నారు. సాగునీటి ప్రవాహానికి అవరోధం లేకుండా పనులు చేయాలని ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్‌కు సూచించారు. అయితే కాలువలో నుంచి తీసిన గుర్రపు డెక్క, తూడుతో పాటు సిల్ట్‌ను బైపాస్ రహదారిపై వేయడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై బురద పేరుకుపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. కాలువలో నుంచి తీసిన మట్టిని ట్రాక్టర్ల సహాయంతో బయట ప్రాంతాలకు తరలించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



కాలువలో తూడు, గుర్రపు డెక్క తొలగిస్తున్న పొక్లయిన్

పార్టీలో గుర్తింపులేదని జనసైనికుడి వీరంగం

మనస్తాపంతో పోలీసులకు ఫిర్యాదు

కోనేరుసెంటర్: మచిలీపట్నం జనసేనపార్టీలో గుర్తింపు కోసం జగడం మొదలైంది. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఒకరిపై ఒకరు గొడవ పడుతూ గాల్లోకి గ్లాసులు విసురుకునే పరిస్థితికి వచ్చింది. ఇదంతా టీడీపీ నాయకుల సమక్షంలోనే జరగటం విశేషం. అసలు విషయంలోకి వెళితే.. రాష్ట్ర గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం మచిలీపట్నంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు హాజరయ్యారు. సమావేశం ముగించుకుని జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ బయటికి వస్తుండగా కొరియర్ శ్రీను అనే జనసేన నాయకుడు ఆవేశంగా ఆర్ అండ్ బీ అతిథిగృహంలో ప్రవేశించి పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నపుడు నాకు కనీసం సమాచారం ఇచ్చే అవసరం లేదా అంటూ నిలదీశాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. అక్కడున్న టీడీపీ నాయకులు సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా జనసేన నాయకులు ఇది మా పార్టీ విషయం, మీకెందుకని గదమాయించటంతో చేసేదిలేక టీడీపీ నాయకులు లోనికి వెళ్లిపోయారు. అక్కడి నుంచి బండి రామకృష్ణ, కొరియర్ శ్రీనుల మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరింది. దీంతో ఇరువురు పార్టీ, వృత్తిపరమైన దూషణలకు దిగారు. హోటల్ వ్యాపారివి వెళ్లి ఆ పని చూసుకో అంటూ బండి రామకృష్ణను కొరియర్ శ్రీను అవమానిస్తూ మాట్లాడటంతో మనస్తాపానికి గురై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో శ్రీనుపై ఫిర్యాదు చేశాడు. మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై చిలకలపూడి పోలీసులు శ్రీనును స్టేషన్‌కు పిలిచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయండి

విద్యుత్, గృహ నిర్మాణ శాఖలపై ఎమ్మెల్యే సమీక్ష

పెడన: పట్టణంలో పలు ప్రాంతాల్లో అంచనాలు రూపొందించిన విద్యుత్‌స్తంభాలు త్వరగా ఏర్పాటు చేయాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో విద్యుత్, గృహ నిర్మాణశాఖలపై పట్టణానికి సంబంధించిన అంశాలపై సమీక్షించారు. 8, 9, 10వ వార్డులకు సంబంధించి విద్యుత్ సరఫరా ఒక పక్క ఉంటూ ఆయా వార్డులలో విద్యుత్ నిలిచిపోవడంపై ఎమ్మెల్యే ఆరా తీశారు. విద్యుత్ సరఫరా గ్రామీణ ప్రాంతంలోని అర్తమూరు ఫీడర్‌కు అటాచ్ చేయడం వల్ల సరఫరా పోతుందని డీఈ భాస్కరరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పట్టణ ఫీడర్‌కు అనుసంధానం చేయాలని ఎమ్మెల్యే విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. 18వ వార్డుతో పాటు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరినా నేటి వరకు వేయకపోవడంపై ఆరా తీశారు. మున్సిపాలిటీ పరిధిలో వేయాల్సి ఉన్న నేపథ్యంలో వారు బిల్లులు చెల్లిస్తే తక్షణం వాటిని ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి పట్టణంలో పల్లోటి-1, పల్లోటి-2, పైడమ్మ లే అవుట్ లలో లబ్ధిదారులు 2,225 మంది ఉన్నారని, ఆ శాఖ ఇన్‌చార్జి డీఈ బుచ్చిబాబు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఇంకా ఎన్ని పూర్తి కావాల్సి ఉందని ఆరా తీశారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం (హన్ను), యక్కల శ్యామలయ్య, వహెబ్‌ఖాన్, బెజవాడ నాగరాజు, విద్యుత్ ఏడీఈ మాణిక్యలరావు, ఏఈ జయరాం, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, ఎమినిటీలు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కాగిత

ఎమ్మెల్యేను కలిసిన శిష్టకరణం నూతన కార్యవర్గం

పెడన: పెడన శిష్టకరణం సంక్షేమ సంఘం నాయకులు, నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను కలిశారు. ఎమ్మెల్యే నివాసంలో కాగితను సన్మానించారు. సంఘ నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ వీణం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీడీపీ శిష్టకరణం సాధికార సమితి కన్వీనర్ అక్కు మహంతిరాజా ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ వివరాలను తెలియజేశారు. ఉపాధ్యక్షులు డాక్టర్ బందారులంక వెంకటేష్, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, ప్రసాదరావు, బాలాజీ, అయ్యప్ప, పవన్ కల్యాణ్, బుజ్జి, నాగేశ్వరరావు, నరసింహారావు, నూకరాజు, నాగయ్య, పున్నయ్య పాల్గొన్నారు.